క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని గ్రామ వీధులలో ఊరేగిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో సుమారు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పాల్గొని స్వామివారికి పాలాభిషేకం చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు మూత్రపిండాల వైద్య శిబిరం

అమలాపురం టౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణం రెండో వార్డులో గల డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు ఆరోగ్య ఉద్యానవనం (తామరు చెరువు పార్కు)లో బుధవారం సాయంత్రం 4 గంటలకు కిడ్నీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దయాలసిస్ యూనిట్లను పర్యవేక్షిస్తున్న అపోలో దయాలసిస్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శంకరరావుతో కూడిన వైద్య బృందం ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తారు. శిబిరాన్ని జిల్లాలోని కిడ్నీ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కిడ్నీ దయాలసిస్ యూనిట్ సెంటర్ ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

నందీశ్వరునికి అభిషేకం



సుంకరపాలెం శివాలయంలో నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో వేంచేసియున్న పురాతన శివాలయంలో మంగళవారం నందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర ఫాల్గుణ మాస త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకంఠం గిరి బాబుశర్మ ఆధ్వర్యంలో తంగేటి వెంకటరమణ, మణిజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రికెట్ లీగ్ టోర్నమెంట్ లోగో ఆవిష్కరణ



క్రికెట్ లీగ్ టోర్నమెంట్ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాస్థాయి జై భీమ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించనునట్లు నిర్వాహకులు కుమ్మ రి అభి, పెయ్యల సాయి, బదుగు అర్జున్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా లోగోను ఆవిష్కరింపజేశారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అల్లవరం: రాజమహేంద్రవరం నేత్ర కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో బోడసకుర్రు పంచాయతీ వద్ద మంగళవారం ఉచితం కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో 200 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, రోళ్ల శ్రీనివాసరావు, పొట్టుపోతు దుర్గారావు, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హలధారి కంట జలధార

- కనుచూపు మేరలో కానరాని సాగునీరు
- కళ్లముందే ఎండిపోతున్న వరిచేలు
- అచేతన స్థితిలో నీటిసంఘాల ప్రతినిధులు
- భరోసా ఇవ్వని అధికారులు
- వినూత్న రీతితో అన్నదాతల ఆందోళన



పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఎండిపోయిన వరి దుబ్బులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తాళ్లరేవు: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేను కళ్లముందే ఎండిపోతుంటే.. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు పడుతున్న బాధ వర్ణణాతీతం. నారుపోసి, వేలాది రూపాయలు వెచ్చించి మూడు నెలల పాటు సంరక్షించిన వరిచేలకు పొట్టదశలో సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. శివారు ప్రాంత భూములకు గత 20 రోజులుగా సాగునీరు పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. ఇలా ఉండగా సాగునీటిని సరఫరా చేయాల్సిన అధికారులు పలు రకాల సాకులు చెపుతూ కాలం వెళ్లదీస్తుండగా, సాగునీటి సరఫరాను సమానంగా పంపిణీ చేయాల్సిన నీటి సంఘాల ప్రతినిధులు కాలువలో నీరే లేకపోవడంతో అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

తాళ్లరేవు మండల పరిధిలోని పి.మల్లవరం శివారు రాంజీనగర్, మూలపాలెం, గ్రాంటు తదితర ప్రాంతాలలోని సుమారు 600 ఎకరాలకు సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. దీంతో ఇటీవల ఆయా శివారు ప్రాంతాల రైతులు సాగునీరందించాలని కోరుతూ రోడ్డెక్కి ఆందోళన చేశారు. సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చి మూడు రోజులు గడుస్తున్నా చుక్క నీరు కూడా వరిచేలకు రాకపోవడంతో ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరిచేలు పొట్టదశలో ఉందని, ఈ సమయంలో సరిపడా నీరు లేకపోతే తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఇక పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ దుస్థితిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆయా ప్రాంతాల రైతులు ఎండిన వరిచేలను చూస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. వరిచేలకు నీరు రాకుంటే మాకు చావే శరణ్యం అని పురుగుల మందు డబ్బాలు చూపి కొందరు, ఎండిపోయిన వరిచేలో మోటారు సైకిళ్లపై తిరుగుతూ మరికొందరు నిరసన వ్యక్తం చేశారు. మా గోడు పట్టించుకునేవారు లేరని, కనీసం దేవుడైనా కరుణించాలని కోరుతూ ఎండిన చేలో పడుకొని మొక్కుతూ ఒకరు, తమ తప్పులు ఉంటే క్షమించి మాకు సాగునీరు సరఫరా చేయమంటూ గుంజీలు తీస్తూ ఆ దేవుడికే మొరపెట్టుకుంటున్న దృశ్యాలు చూపరులకు కంటతడి పెట్టిస్తున్నాయి. కనీసం పంట కాలువలో ఇంజిన్ పెట్టుకుని తోడుకుందామంటే ఇంజిన్లను అధికారులు తొలగించి కేసులు నమోదు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



రాంజీనగర్ శివారు భూముల్లో వరిచేలో మోటారు సైకిళ్లను తిప్పుతూ నిరసన



పంటను కాపాడుకునేందుకు కాలువ నీటిని బకెట్‌తో పొలానికి పంపిస్తున్న రైతులు

తక్షణమే సాగునీరు సరఫరా చేయాలి



కష్టించి పండించిన వరిచేలు కళ్లముందే ఎండిపోతుంది. పొట్ట దశలో ఉన్న చేలకు పూర్తి స్థాయిలో నీరు పెట్టకపోతే ఆ ప్రభావం పంటపై పడి దిగుబడి తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతాం. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.20 వేలకు పైగా ఖర్చయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలి.

కావూరి బుజ్జి, రైతు, రాంజీనగర్ గ్రామం.

అధికారుల తీరుతో అవస్థలు



ఏటా ఇదే సమయంలో శివారు ప్రాంతాలకు సాగునీటి సమస్య వస్తుంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదు. వంతుల వారీ విధానం అమలు చేస్తున్నప్పటి నుంచి సాగునీరు అందకుండా పోతుంది. వంతు వచ్చినపుడు ఎగువన ఉన్న రైతులు నీటిని వాడేస్తుండడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మాకు ఈ దుస్థితి తలెత్తుతోంది.

మేడిశెట్టి శ్రీను, రైతు, గ్రాంటు గ్రామం.

శివారుకు సాగునీరు అందిస్తాం

బాపనపల్లి లాకు వద్ద టేకు డ్రెయిన్ నుంచి మెయిన్ కెనాల్‌కు నీటిని లిఫ్ట్ చేసేందుకు విద్యుత్ మోటార్‌లను ఏర్పాటు చేస్తాం. శివారుకు సాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడతాం.

అనూష, ఇరిగేషన్ ఏఈ, తాళ్లరేవు.

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పితాని



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీసినట్లు పితాని బాలకృష్ణ తెలిపారు.

విద్యార్థులలో సృజనను వెలికితీయాలి

ముమ్మిడివరం: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక అంశంలో ప్రావీణ్యం ఉంటుందని అది వెలికి తీసే విధంగా బోధన ఉండాలన్నారు. బోధనా సిబ్బందితో పాటుగా బోధనేతర సిబ్బంది విధుల పట్ల అంకిత భావంతో పనిచేయడం ద్వారా జిల్లాను విద్యాపరంగా మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఫైనాన్స్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రమణ్యం, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఏఎంవో రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రదేశాలను గుర్తించి నివారణకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి రహదారి ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులలో అవసరమైన వేగ నియంత్రణ ఏర్పాట్లు చేయాలని, రోడ్డు భద్రతపై అవగాహన పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. 2025లో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 117 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా ఈ ప్రమాదాల్లో 39 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాతీయ రహదారులు, భవనాల శాఖ ఎస్ఈ రాము, సాంకేతిక నిపుణులు, జిల్లా రవాణా అధికారి దేశనీడి శ్రీనివాసరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. భూ పరిపాలన, రీ సర్వే అంశాలలో ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సేవలందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులపై కక్ష సాధింపు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: ఆర్టీసీలో నిబద్ధతతో పని చేస్తున్న ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లపై యాజమాన్యాలు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు అన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎన్ఎంయూ జిల్లా మహాసభను మంగళవారం అమలాపురం మండలం ఈదరపల్లిలో నాయీ బ్రాహ్మణ కమిటీ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ అమలాపురం డీపోలో డ్రైవర్ బీఎస్ నారాయణను సస్పెండ్ చేయడంపై మండిపడ్డారు. అక్రమంగా, అన్యాయంగా నారాయణను సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, హక్కులపై నేషనల్ మజ్దూర్ యూనియన్ నిరంతర పోరాటం చేసి అండగా ఉంటుందన్నారు. డీపోలో16వ రోజు రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. అనంతరం డీపీటీ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, జోనల్ కార్యదర్శి అడపా రామారావు, జోనల్ అధ్యక్షుడు డీఎంఆర్ రాజు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు బండి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ దంపతులు



విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి (మీసాల వెంకన్న)

యానాం: యానాంలో కొలువైన చారిత్రక భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. యానాం ప్రజల తరఫున స్వామివారికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, స్నేహ దంపతులు పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి వెంకటేశ్వరరావు చేతులమీదుగా పట్టు పీతాంబరాలు, సువర్ణ యజ్ఞోపవీతం సమర్పించారు. కల్యాణోత్సవానికి యానాం పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

కలెక్టరేట్ వద్ద నడిపూడి గ్రామస్తుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నడిపూడి గ్రామస్తులు

అమలాపురం రూరల్: రూరల్ మండలం నడిపూడి గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య నెలకొన్న భూ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాల్సిన తహసీల్దార్ ఆ రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తే విధంగా ప్రవర్తించారని దీనిపై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నడిపూడి గ్రామ ప్రజలు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. మండల స్థాయి అధికారిగా ఉన్న తహసీల్దార్ ఘర్షణలు తలెత్తే విధంగా ఒక వర్గాన్ని సపోర్ట్ చేస్తూ వ్యవహరించడం అన్యాయమని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి భూమి ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచిన తహసీల్దార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దాత దానం చేసిన ఆలయ కమిటీ భూమికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న గన్నవరం వీఆర్వో మంద లక్ష్మణరావుపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలమూరు మోహన్‌బాబు , పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బుడితి దయ మహేష్, కుంచె రమేష్‌లు మద్దతు పలికారు.

యువత పోరుకు తరలిరండి

- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పిలుపు
- ముమ్మిడివరంలో పోస్టర్ ఆవిష్కరణ



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే యువత పోరు ఆందోళనకు అంతా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి కూటమి ప్రభుత్వం వారితో చెలగాటమాడుతూ ఆరాచక పాలన సాగిస్తుందన్నారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. ప్రసుత్తం బకాయి పెట్టిన ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, తాళ్లరేవు జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, కాశి బాలముని కుమారి, కోలాబాబ్జీ, బొంతు సత్య శ్రీనివాస్, సరిపెల్ల రామకృష్ణంరాజు, కోన శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: యువతను మోసం చేసుకున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం జరిగే యువత పోరుకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు కోరారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను, యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఆందోళనలో భాగంగా అమలాపురం కలెక్టరేట్ వద్ద కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, నిరుద్యోగులకు అన్యాయం

అమలాపురం టౌన్: విద్యార్థులను ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలోనూ, నిరుద్యోగులను భృతిపరంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలువునా మోసం చేస్తున్నారని అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ ఆరోపించారు. అందుకే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన యువత పోరు కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద జిల్లా వైఎస్సార్ సీపీ బుధవారం ఉదయం తలపెట్టిన నిరసన గళంలో జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు గొంతు కలిపి కూటమి ప్రభుత్వ కల్లబొల్లి హామీలపై నినదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువత పోరును విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం ఉదయం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి జిల్లాలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పరంగా కూటమి ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న దృష్ట్యా ఈ పోరులో అంతా పాల్గొనాలని శిరీష్ పిలుపునిచ్చారు.

నేడు పుదుచ్చేరి బడ్జెట్ సమర్పణ

యానాం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ సీఎం రంగసామి ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో యానాం నియోజకవర్గానికి సైతం వివిధ పథకాలకు నిధులు మంజూరు చేస్తారని స్థానికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అవుతుంది. దీంతో భారీగా సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేస్తారని ప్రచారం జరుగుతుంది.

ఘనంగా హనుమంత వాహనోత్సవం

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హనుమంత వాహనం వైభవంగా జరిగింది. తోట వెంకట వేణుగోపాలరావు ఉత్సవదారులుగా జరిగిన హనుమంత వాహనోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 9581932678 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు.

'నడకతో విజేత' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన నడక కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి రచించిన «నడకతో విజేత» పుస్తకాన్ని బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక ఈదరపల్లి వంతెన వద్ద గల కనకయ్య ఇంట్లో జరిగిన ఈ కార్యక్రమంలో నడకకవి తాను నడకపై రచించిన నానీల పుస్తకాల గురించి వివరించారు.

ఉప్పునీరు మాకొద్దు మహాప్రభో..



ప్రధాన పంట కాలువలోకి ఉప్పునీరు తోడవద్దంటూ ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాళ్లరేవు: ప్రధాన పంట కాలువకు ఎత్తిపోతల ద్వారా తోడుతున్న నీరు ఉప్పగా ఉంటుందని, ఆ నీటివల్ల తమ పంటచేలు దెబ్బతింటాయని పలువురు రైతులు మంగళవారం ఆందోళన చేశారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఎగువ ప్రాంత రైతులు ఆందోళన చేసి ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ శివారు భూములకు సాగునీటి సమస్య కారణంగా అధికారులు మల్లంకోట డ్రెయిన్ నుంచి నీటిని తోడుతున్నారని, అయితే ఆ నీరు ఉప్పునీరు కావడంతో ఆ నీటిని వినియోగిస్తే తమ పంట దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. వంతును పెంచి మంచినీటినే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు, ధూళిపూడి గోపి, బ్రహ్మం, నాయకులు దడాల బుజ్జిబాబు, వల్లు రాజబాబు, ఎం.సత్యన్నారాయణ, పలివెల శేషారావు, సింహాచలం, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేయాలి

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అభివృద్ధికి తలపెట్టిన పెంకేవారిపేట శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ కోరారు. స్థానిక సంతపేట సెంటర్‌లో లయన్స్‌క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యారాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు శ్మశాన వాటిక అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను సూచించారు.

పంట కాలువలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్ కుమార్

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పరిధిలోని కొత్తకాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై సీహెచ్ రాజేష్ కుమార్ మంగళవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక పంట కాలువలో మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీశామన్నారు. వీఆర్వో కుమార్ రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

అమలాపురం రూరల్: కొబ్బరి తోటలోకి దౌర్జన్యంగా ప్రవేశించి దింపులు తీసి కొబ్బరికాయలు తరలించడంతో పాటు అడ్డువచ్చిన వారిని చంపుతామని బెదిరించిన కేసులో పలువురిపై కేసు నమోదు చేసినట్లు అమలాపురం తాలూకా ఎస్సై వై.శేఖర్‌బాబు మంగళవారం తెలిపారు. బండారులంకలో తన ఆధీనంలో ఉన్న కొబ్బరి తోటలోకి ప్రవేశించి దింపు తీసి మూడువేల కొబ్బరికాయలను దౌర్జన్యంగా తరలించుకుపోయినట్లు యుళ్ల మురళీకృష్ణ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డువచ్చిన తనతో పాటు తన కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడ్డవారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.